## క్లుప్తంగా

### దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

రాయపర్తి(వర్ధన్నపేట) : దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కోరారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.అరుణ్‌కుమార్, బరిగెల బాబు, చల్లా మిథిన్, చరణ్, రాంచంద్రు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

గీసుకొండ : కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నమిండ్ల క్లైమెంట్ అన్నారు. సోమవారం గీసుకొండలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యా హక్కు చట్టంపై నిర్వహించే రాష్ట్ర సదస్సుకు మాదిగ యువకులు, విద్యావంతులు తరలి రావాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరిగెల యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆసంఘం జిల్లా, నాయకులు కొమ్ముల భిక్షపతి, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం

పర్వతగిరి : వడ్లకొండ గ్రామంలోని రంగ నాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామానికి చెందిన చింతకాయల రజితసాయిలు రూ. 20,116 విరాళం అందజేశారు. కాగా, దాతను ఆలయ నిర్మాణ కమిటీ సన్మానించింది.

### పర్వతాల శివాలయంలో ప్రత్యేక పూజలు



పర్వతగిరి : మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలలో ఒక సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా అంకం శ్యాం, ఆదండ భిక్షపతి, దొడ్డ రమేష్ భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇంటికి రూ.100 గుడికి చందా రశీదు పుస్తకాలను వితరణ చేశారు. సభ్యులు చింతల శ్రీనివాస్, దయాకర్, అనుమాండ్ల దేవేందర్, రంగు జనార్దన్‌గౌడ్, ఎర్రబెల్లి హరికుమార్, ఆకుల దేవేందర్, కుమారస్వామి, రంజిత్‌కుమార్, సోమేశ్వర రావు, భద్రునాయక్, సురేష్, మాలోత్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

### ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

నర్సంపేట : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కొమ్ముక రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జీఓ1లో స్పష్టంగా విద్యాశాఖ అనేక నియమ నిబంధనలను పొందుపర్చిందన్నారు. ప్రధానంగా ఫీజులు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, టై, బెల్ట్ వంటి అంశాలను నిశితంగా పొందుపర్చిందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ఆయా పాఠశాలలకు సంబంధించిన పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు, ఇతర వస్తువులను పాఠశాల ఆవరణలో విక్రయాలు చేయరాదని ఆదేశాలు ఉన్నాయన్నారు. కానీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ స్కూల్ గదిలో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా తక్షణమే అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, వెంకటేష్, బాలు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు : రిటైర్డ్ తహసీల్దార్ మన్నె నాగయ్య సేవలు మరువలేనివి అని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేటలో సోమవారం హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో పెంచికలపేట గ్రామస్తుడు రిటైర్డ్ తహసీల్దార్ నాగయ్య జ్ఞాపకార్థం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంగెం: చింతలపల్లి ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


నల్లబెల్లి: ఈద్గాలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న మత గురువు


నర్సంపేట: మసీద్ వద్ద ముస్లింల అలయ్ బలయ్


సంగెం: గవిచర్ల ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


# త్యాగానికి ప్రతీక బక్రీద్

నర్సంపేట : నర్సంపేట పట్టణ వ్యాప్తంగా బక్రీద్ వేడుకను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఈద్గాలో బక్రీద్ సందర్భంగా భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మత గురువు మౌలానా మహబూబ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి చిహ్నమని, ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ఒకరికొకరు సాయం చేసుకుంటూ తమ జీవితాన్ని పవిత్ర గ్రంథమైన ఖురాన్‌లో సూచించిన విధంగా గడపాలన్నారు. కార్యక్రమంలో జామే మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్‌నబీ, గౌరవ అధ్యక్షుడు ముర్షద్, గౌరవ సలహాదారులు జావేద్, ఖలీల్, కోశాధికారి సలావుద్దీన్ అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి హబీబ్, కార్యదర్శి అజీజ్, ఇంతియాజ్, అజ్మత్‌పాషా, మాజీ అధ్యక్షుడు షరీఫ్, షేక్ జాఫర్, షేక్ జావేద్, మీర్జా మసూద్‌అలీబేగ్, హుస్సేన్, ఖలీల్, జలీల్, మీర్‌సాజిద్‌అలీ, యాకుబ్‌పాషా, ఖదీర్, ఇర్ఫాన్, మహ్మద్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ అయ్యూం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ గఫార్, వహీద్, వసీం అక్రం, జావీద్, ఇజాజ్ అహ్మద్, ఫయాజ్, అన్వర్, నిజాం, హాజీపాషా, సమీర్, బాషు, రఫీ, జాన్, బషీర్, పాషా, హైదర్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని ఆయా గ్రామాల్లో బక్రీద్‌ను ముస్లింలు సోమవారం జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అక్బర్, మహ్మద్, అజీజ్, యాకూబ్, షావుద్దీన్, లాల్‌మహ్మద్, రాజాసాహెబ్, రజాక్, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.


దుగ్గొండి: మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

**ఘనంగా బక్రీద్ వేడుకలు**

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, కాట్రపల్లి, కొండూరు, మైలారం, కొత్తూరు తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొన్నారు.

రాయపర్తి(వర్ధన్నపేట) : వర్ధన్నపేట పట్టణ కేంద్రంతో పాటు గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సంగెం : మండల కేంద్రంతో పాటు చింతలపల్లి, గవిచర్ల, నల్లబెల్లి, నార్లవాయి, పల్లారుగూడ, ఎల్గూర్‌రంగంపేట, సంగెం, తిమ్మాపూర్ గ్రామాల్లో బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మన్సూర్ అలీ, ఖాజాపాష, రబ్బాని, అజ్గర్, మైన్‌మొద్దిన్, యాకూబ్‌పాష, హైమద్, రియాజ్ గవిచర్లలో ఇస్మాయిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల వ్యాప్తంగా బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

**నల్లబెల్లిలో..**

నల్లబెల్లి : మండల కేంద్రంలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత గురువు రషీద్ అన్వర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అన్నారు. మత పెద్దలు షబ్బీర్, నన్నేసాహెబ్, సద్దాం హుస్సేన్, హైమద్, అహ్మద్, అఫ్జల్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నారావుపేట: బక్రీద్ సందర్భంగా నమాజ్ చేస్తున్న ముస్లింలు


అలయ్ బలయ్ తీసుకుంటున్న ముస్లింలు


నర్సంపేట: బోధనలు చేస్తున్న మతగురువు


రాయపర్తి: ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు


రాయపర్తి: ఈద్గాలో..

## గ్రంథాలయ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నర్సంపేట : గ్రంథాలయ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గ్రంథాలయ ఉద్యమకర్త, సాహితీవేత్త కాసుల రవికుమార్ అన్నారు. ఈ మేరకు లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఇటీవల నర్సంపేట నుంచి మరో గ్రంథాలయ ఉద్యమ యాత్రను ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేసిన కాసుల రవికుమార్, మంచికంటిని సోమవారం పలువురు మేధావులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో, ప్రతీ గ్రామం, ప్రతి పాఠశాలలో ఒక గ్రంథాలయం ఉండేలా కృషి చేయాలన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమ యాత్రకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఐదేళ్లలో తమ సమయాన్ని గ్రంథాలయ ఉద్యమానికి కేటాయించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, ప్రజలు గ్రంథాలయాల అభివృద్ధికి పాటు పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఒక మంచి లక్ష్యం కోసం జరుగుతున్న ఈ ప్రయత్నంలో తమకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీజుల సాగర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు రఘుపతి, నరసింహ, శ్రీనివాస్, పిట్టల సురేందర్, శివ,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ


నర్సంపేట: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్ది స్వప్న తదితరులు

నర్సంపేట : నర్సంపేట పట్టణానికి చెందిన ఎస్ఆర్ఐ పిన్న భాస్కర్ నాయనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నసుదర్శన్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, మేడిద శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గీత కార్మికుడికి..**



చెన్నారావుపేట : మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన గీతకార్మికుడు మేరుగు సంపత్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా సోమవారం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు గంధం భాస్కర్, ప్రధాన కార్యదర్శి అంబాల క్రాంతి, గౌరవ సలహాదారులు మేర్గు బాబు, వెంకన్న పరామర్శించారు.
బాధ్యులు అభినందించారు.

## నిధులు మంజూరైనా.. నిర్లక్ష్యంగా పనులు


నిలిచిన పనులను చూపుతున్న మాజీ ఎంపీపీ అశోక్

చెన్నారావుపేట : జల్లీ శివారులోని బతుకమ్మ స్థలం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని మాజీ ఎంపీపీ జక్క అశోక్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రతి ఏటా బతుకమ్మ ఆడేందుకు వెళ్తుంటే రోడ్డు బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదే రోడ్డులో శ్మశాన వాటిక, ముస్లింల ఖబరస్తాన్ ఉందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఆర్ నిధుల నుంచి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ. 50 లక్షలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. సంబంధిత కాంట్రాక్టర్ వివరాలు అడగగా పనుల అగ్రిమెంట్ ఉన్నా ఎన్నికల కోడ్‌లో పనులు చేయలేకపోయామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ‘మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి’

పర్వతగిరి : మట్టి, మొరం అక్రమ రవాణా తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో అక్రమ మట్టి దందా జరుగుతుందని ఆరోపించారు. నిబంధనల మేరకు మట్టి తరలించాలని ఆయన అధికారులను కోరారు.

**మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలి**

రాయపర్తి(వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి ఎల్లమ్మ చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేగడిమట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. రేగడిమట్టిని సీహెచ్ శివరామకృష్ణ అనే వ్యక్తి 2,000ల క్యూబిక్ మీటర్ల కోసం పర్మిషన్ తీసుకున్నట్లు చెబుతున్నారే తప్ప ఏమీ తెలియకుండా పోయిందన్నారు. రెండ్రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇప్పటికే 4,000ల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారన్నారు. ఇప్పటికైనా మట్టి తరలింపును ఆపకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## రేవంత్ రెడ్డి కుట్రను తిప్పికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నల్లబెల్లి : రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నిబంధనల పేరుతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను రైతాంగం తిప్పికొట్టాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు, రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు గడిచినా రుణ మాఫీ చేయకపోగా.. పాస్‌బుక్‌లు, రేషన్ కార్డులు ఉన్న రైతులకే ఇవ్వాలని కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ రైతాంగాన్ని ప్రభుత్వం మోసగించేందుకు సిద్ధపడుతోందని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారికి ఈ పథకం నుంచి మినహాయించాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. రుణ మాఫీకి రేషన్ కార్డు నిబంధన పెడితే కుటుంబంలో ఒక్క రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తించే అవకాశం ఉంటుందన్నారు. రైతులందరికీరుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు నిబంధనల పేరుతో రుణమాఫీ ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనర్హులను ప్రకటించే ఆలోచన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలతో 66 లక్షల మంది అర్హులైన రైతులుండగా 37.50 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ వర్తించే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలో 72,887 మంది రైతులు రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకోగా 27,576 మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తించే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు పంట రుణాలు పొందిన రైతులందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, నానబోయిన రాజారాం, ఇంగ్లే శివాజీ, క్యాతం శ్రీనివాస్, మామిండ్ల మోహన్ రెడ్డి, బొట్ల పవన్, వైనాల వీరస్వామి, పాండవుల రాంబాబు, ఆకుల సాంబరావు, నాగెల్లి ప్రకాశ్, పాతునూరి సుబాష్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీలపై దాడులు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

దుగ్గొండి : గ్రామాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలందిస్తున్న ఆర్‌ఎంపీలపై దాడులు ఆపాలని ఆర్‌ఎంపీల మండల సంఘం అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు తక్షణ ప్రథమ చికిత్స అందిస్తున్న తమపై అధికారులు కక్షపూరితంగా దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పాలడుగుల సాంబయ్య, కార్యదర్శి జీవన్, కోశాధికారి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, కూచన రమేష్, బోగి రఘుపతి, రాజు కుమార్, నామాల రాజు, శ్రీనివాస్ స్థానిక ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

## జలాభిషేకం



సంగెం : వానలు బాగా కురవాలని కోరుతూ మండల కేంద్రంలో మహిళ రైతులు గ్రామదేవత బొడ్రాయికి సోమవారం బిందెలతో జలాభిషేకం చేశారు. వానలు కురవక విత్తనాలు మొలకెత్తక అన్నదాతలు ఆగం అవుతున్నారని వరుణదేవుడు కరుణించి వానలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా ఉండేలా దీవించు తల్లి అంటూ వేడుకున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ


సామగ్రిని అందజేస్తున్న శివానంద్

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్–2లో చిన్నారులకు అవసరమైన కుర్చీలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఆట వస్తువులతో పాటు పలు రకాల సామగ్రిని సోమవారం చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు పెండెం శివానంద్ వితరణ చేశారు. ఈ సందర్భంగా శివానంద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌కు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు ప్రభుత్వ సహకారాలతో పాటు, దాతల సహకారం తప్పనిసరి అని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా మరింత ముందుకు వెళ్తాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ గౌరై రాధ, పాకాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, రాంబాబు, పుల్లూరి రాజుగౌడ్, గద్దమీది సతీష్, రామగోని సొందరయ్య, హెల్పర్ కవితతో పాటు తల్లులు పాల్గొన్నారు.

## ‘నీట్’ అవకతవకలపై విచారణ చేపట్టాలి

చెన్నారావుపేట : నీట్ అవకతవకలపై విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నీట్ పరీక్ష తీరుపై కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలో పడేసిందని అన్నారు. మార్కుల గందరగోళం, పేపర్ లీకేజీలు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదన్నారు. పేపర్ లీకేజీలపై విచారణ చేసి నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. బీహార్, గుజరాత్‌లో పేపర్ లీకేజీ అంటూ ప్రచారాలు జరుగుతున్నా కేంద్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడు లేని విధంగా నీట్ పరీక్షల్లో 67 మందికి ఫస్ట్ ర్యాంకు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒకే సెంటర్‌లో 8 మంది విద్యార్థులకు 720 మార్కులు సాధించడం విశేషమన్నారు. సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.